ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
MAHABUBABAD
శుక్రవారం 19 సెప్టెంబరు 2025
5



నేడు జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మానుకోట పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఈనెల 19న జిల్లాస్థాయి సైన్స్‌డ్రామా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి గురువారం తెలిపారు. ఈ సైన్స్ డ్రామా పోటీలకు ప్రధాన అంశంగా 'సైన్స్‌అండ్ టెక్నాలజీ ఫర్ ద బెనిఫిట్ ఆఫ్ మ్యాన్‌కైండ్' ఉంటుందన్నారు. సబ్ థీమ్స్‌గా ఉమెన్ ఇన్‌సైన్స్, స్మార్ట్ అగ్రికల్చర్, డిజిటల్ ఇండియా ఎంపవరింగ్ లైవ్స్, గ్రీన్ టెక్నాలజీ అని తెలిపారు. గూగుల్ ఫామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాలల విద్యార్థులు, గైడ్ టీచర్స్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు డీఎస్వో అప్పారావు సెల్ నెంబర్ : 98495 98281ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సీరోలు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కురవి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. సీరోలు మండలకేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో బాలుర, బాలికల వసతి గృహాలను, విద్యార్థులకు సంబంధించిన స్టడీ మెటీరియల్, పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటశాలను పరిశుభ్రంగా ఉంచి నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించాలని, క్రీడలపై దృష్టి సారించాలని అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట తహసీల్దార్ పున్నం చందర్, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ సంతోష్‌సోనీ, పాఠశాల హెచ్‌ఎం బంగారి, ఆర్‌ఐలు సుమతి, శ్రావణి, గ్రామ పాలన అధికారి వీరస్వామి పాల్గొన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 ప్రముఖ కంపెనీలు పాల్గొని, సుమారు 500 ఖాళీలకు నేరుగా ఇంటర్వ్యూ నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేట్, బి.టెక్, ఎం.టెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటాతో విద్యార్హత సర్టిఫికెట్లు, ఐడీప్రూఫ్, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మేడారంలో ప్రారంభానికి నోచుకోని పోలీస్‌స్టేషన్



కొత్త ఠాణాలు ఎప్పుడో..?!

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఏళ్ల తరబడి కాగితాల్లోనే మూలుగుతున్న ప్రతిపాదనలు

- ఉమ్మడి జిల్లాలో గతంలోనే 3 పోలీస్‌స్టేషన్లు, 6 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- నడికూడ, మేడారం, అలుబాకలో ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కేయూ, జనగామ, నర్సంపేట, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లకు ప్రతిపాదనలు
- పోలీస్‌కమిషనరేట్ పరిధిలో రెండు పోలీస్‌స్టేషన్లు అవసరంగా గుర్తింపు
- అప్‌గ్రేడేషన్‌కు నోచుకోని పోలీస్‌స్టేషన్లు.. సిబ్బంది కొరతతో అవస్థలు..

కొత్త ఠాణాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు కాగితాలకే పరిమితమవుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో కొత్తగా ఠాణాల ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. కొత్త జిల్లాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. వీటితో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా మరో రెండు పోలీస్‌స్టేషన్‌ల కోసం చేసిన ప్రతిపాదనల ఫైలు కదలటం లేదు. దీనికి తోడు ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడేషన్‌కు నోచుకోవటం లేదు. దీంతో చాలా పోలీస్‌స్టేషన్లలో అరకొర సిబ్బందితో స్టేషన్లను నెట్టుకురావాల్సి వస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కాగితాల్లోనే కొత్త ఠాణాలు

కొత్త ఠాణాల ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో 45 పోలీస్‌స్టేషన్లు ఉండగా, భూపాలపల్లిలో 13 పీఎస్‌లు, ములుగు జిల్లాలో 10, మహబూబాబాద్ జిల్లాలో 18 పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. మొత్తం గా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 86 పోలీస్‌స్టేషన్లు ఉండగా, పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న కాలనీలతో కొత్తగా (మిగతా 7లో..)



నూనె గింజల పంటలను సాగు చేయాలి

- యూరియా వాడకాన్ని రైతులు తగ్గించాలి
- వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తీర్ణ సంచాలకుడు యాకాద్రి



కురవిలో పత్తిపంటను పరిశీలిస్తున్న యాకాద్రి, శాస్త్రవేత్తలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో ముసధోరణి విడనాడి, ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవడానికి పంట మార్పిడి చేసి.. పప్పు, నూనెగింజల పంటల సాగుకు మొగ్గు చూపాలని ప్రొఫెసర్ తెలంగాణ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తీర్ణ సంచాలకుడు ఎం.యాకాద్రి సూచించారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రథమశ్రేణి ప్రదర్శనలు, క్షేత్ర దినోత్సవాలు, రైతులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలపై, జిల్లాలో సాగవుతున్న ప్రధాన పంటలపై శాస్త్రవేత్తలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేరకం పంటలు వానాకాలంలోనూ.. యాసంగిలోనూ సాగు చేయొద్దని, అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగువైపుకు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. కేవలం వ్యవసాయం అనుబంధ రంగాలైన పాడి, ఉద్యాన, గృహవిజ్ఞానంలో కూడా మెళకువలు తీసుకోవాలని శాస్త్రవేత్తలకు సూచించారు. యూరియా వాడకాన్ని వీలైనంత తగ్గించి పచ్చిరొట్ట పంటలు వేసి కలియదున్నడంపై, పంట అవశేషాలు కల్చకుండా నేలలోనే కలియదున్నే విధంగా రైతులకు వివరించాలన్నారు. అనంతరం శాస్త్రవేత్తలతో కలిసి కురవి మండలంలోని పత్తి చేలను, ఆయిల్‌పామ్ తోటలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ దిలీప్‌కుమార్, శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, సుహాసిని, దినేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి దిశా సమావేశం వాయిదా

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదనరాజు


మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు జరగాల్సిన దిశ కమిటీ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మధుసూదనరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పాపం పెసర రైతు

- వర్షాలతో దెబ్బతిన్న నాణ్యత
- మార్కెట్లో 'మద్దతు' కరువు
- పడిపోయిన సగటు ధరలు



కేసముద్రం మార్కెట్లో పెసలు నాణ్యతను పరిశీలిస్తున్న వ్యాపారులు



కేసముద్రం, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వరుస వర్షాల ప్రభావంతో ఆరుతడి పంట అయిన పెసలు రైతులకు మార్కెట్లో మద్దతు ధర లభించడం లేదు. పెసర పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు పడుతుండడంతో తడిచి నాణ్యత దెబ్బతింటున్నట్లు రైతులు వాపోతున్నారు. దీంతో మార్కెట్‌కు తీసుకువచ్చే పెసలులో ఒకటి, రెండు మినహా నాణ్యత లేనివే వస్తున్నట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో పెసర పంట సాధారణ విస్తీర్ణం 4,066 ఎకరాలు కాగా, ఈ వానాకాలంలో 1,728 ఎకరాల్లో సాగు చేశారు. విత్తనాలు వేసిన నాటి నుంచి 70 నుంచి 80 రోజుల్లో పెసర పంట ఉత్పత్తి చేతికి వచ్చే రకాలనే అధికంగా రైతులు సాగు చేశారు. అరకొర దిగుబడి వస్తున్న పెసలు తొలగించి మిర్చి పంటను సాగు చేస్తున్నారు. అయితే ఈ సారి పెసలు గింజలు పోసుకొని కాయ ఎండిపోయే దశలోనే వర్షాలు పడడంతో మొక్కలపైనున్న కాయల్లోని గింజలు తడిచి ఉబ్బిపోవడంతో నాణ్యత దెబ్బతిందని తెలుస్తోంది. అలా ఉబ్బిపోయిన గింజలను తిరిగి ఎండబెట్టిన అనంతరం గింజ ముడతలుగా మారి నాసిరకంగా ఉంటోంది. ఇలాంటి గింజలను పప్పు మిల్లుల్లో పోస్తే రెండుగా విడిపోయి పప్పుగా మారకుండా పొడిగా అవుతుందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

క్వింటా రేట్ రూ.5,093

కేసముద్రం మార్కెట్‌కు గురువారం 16 మంది రైతులు 63 క్వింటాళ్ల పెసలు తీసుకురాగా ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.7089, కనిష్ఠంగా రూ.2311, సగటున రూ.5093 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. నిన్న, మొన్నటి వరకు పెసర క్వింటాకు సగటు ధరలు రూ.5200 నుంచి రూ.5400 ఉండగా తాజాగా రూ.5093 రావడం గమనార్హం. మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చే పెసర్లలో ఒకటి, రెండు కుప్పలు మినహా మిగతా సరుకుఅంతా నాసిరకమైన గింజలతో కూడి ఉంటోందని వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి పెసలు ప్రభుత్వ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాకు రూ.8682 ఉండగా.. ఆ ధర రావడంలేదు. కొంత నాణ్యతగా ఉన్న పెసలుకు క్వింటాకు గరిష్ఠంగా రూ.7000 నుంచి రూ.7200 వరకే ధర వస్తోంది. ఇదిలా ఉండగా మార్కెట్‌కు వచ్చిన నాణ్యమైన పెసలును రైతుల వద్దనే నేరుగా పలువురు ఇళ్లలో ఉపయోగించుకునేందుకు రూ.80లకు కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఏటా యాసంగి సీజన్‌లోనే మార్కెట్‌కు నాణ్యతమైన పెసలు వస్తాయని, ఈ వానాకాలం పెసలు ఇలాగే ఉంటాయని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనా వరుస వర్షాల ప్రభావంతో పెసర ఉత్పత్తి నాణ్యతపై పడి రైతులకు మార్కెట్లో మద్దతు ధర రావడంలేదనేది వాస్తవం.

యార్డుకు ఉదయం 9 గంటల్లోగా సరుకులు తీసుకురావాలి

- మానుకోట మార్కెట్ కార్యదర్శి శంషీర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉదయం 9 గంటల్లోపే సరుకులను తీసుకురావాలని మహబూబాబాద్ మార్కెట్ కార్యదర్శి శంషీర్ రైతులను కోరారు. మానుకోటలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల్లోపే మార్కెట్ యార్డుకు వచ్చిన సరుకులకు లాట్ నెంబర్, ఐడీ నెంబర్‌లు ఇవ్వబడుతాయని చెప్పారు. తొమ్మిది గంటల తర్వాత యార్డుకు వచ్చిన సరుకులు అనుమతించబడవని, లాట్ నెంబర్, ఐడీ నెంబర్ ఇవ్వబడదని పేర్కొన్నారు. రైతులు గమనించి తొమ్మిదిగంటల్లోగా యార్డుకు సరుకులు తీసుకురావాలని కోరారు.

పరామర్శకు వెళ్లొస్తూ... తనువు చాలించిన వృద్ధురాలు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్
- ఆడబిడ్డ చనిపోగా వెళ్లి వస్తుండగా ఘటన
- వర్ధన్నపేటలోని డీసీ తండా వద్ద ఘటన
- వృద్ధురాలి దుర్మరణం, కొడుకుకు తీవ్ర గాయాలు

6

ప్రభుత్వం సీసీ రోడ్డును నిర్మించాలి

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి



రైల్వే గేట్ ప్రాంతంలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మానుకోట రైల్వేగేట్ ప్రాంతంలోని బురద, గుంతలమయమైన మెటల్ రోడ్డుపై సీసీ రోడ్డును నిర్మించాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రైల్వేగేట్ ప్రాంతంలో బురదమయమైన రోడ్డుపై సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేగేట్ ప్రాంతంలోని మెటల్ రోడ్‌పై నుంచి దాదాపు 15కాలనీల ప్రజలతో పాటు రైల్వేగేట్ నుంచి కొత్త. పాత బజారులకు అనేక మంది రాకపోకలు కొనసాగిస్తారని చెప్పారు. చిన్న వర్షం వచ్చిన ఆ రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ప్రత్యామ్నాయంగా మూడవ రైల్వే లైన్ పూర్తయిన సందర్భంగా రైల్వేకు సంబంధించిన ప్రధాన తారు రోడ్డును తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు స్పందించి ప్రస్తుత మెటల్ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, శ్రావణ్, ఎమ్డీ. ఫాతిమా, అశోక్, మంద శంకర్, తండా శ్రీనాథ్, శ్యాంప్రసాద్, గడ్డం స్వరూప, సిద్ధార్థ, పద్మ, శారద, కుమార్, పాల్, మధుకర్, కవిత, మాధవి, వినోద, షంషీర్, లాలు పాల్గొన్నారు.

సింగరేణిలో కలకలం

- కేటీకే 5 ఇంక్లైన్ భూగర్భ గనిలో మంటలు
- విష వాయువులతో నలుగురు కార్మికులకు అస్వస్థత
- భూపాలపల్లిలో ఘటన.. కార్మిక కుటుంబాల ఆందోళన



కేటీకే 5 ఇంక్లైన్ గని ఆవరణలో రక్షణ చర్యల్లో రెస్క్యూ టీమ్



అస్వస్థతకు గురైన అన్వేష్, రంజిత్‌కుమార్, రఘు, క్రాంతికుమార్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని 5 ఇంక్లైన్ గని రెండో లెవల్ మ్యాన్‌రైడింగ్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదం కలకలం రేపింది. గురువారం మొదటి షిఫ్టుకు ముగింపు సమయంలో కార్మికులు గనిలోపల గ్లాటర్లు మార్చి.. పాత వాటిని కట్ చేసి వాటిని తీసేసి స్లాబ్ చేసి క్లోస్ చేసే పని వెల్డింగ్ ద్వారా చేపట్టారు. దీంతో స్లాబ్ పైన గ్యాస్ కటింగ్ చేయడం మూలంగా నిప్పు రవ్వలు చెలరేగి బొగ్గు పెల్లలకు అంటుకొని మంటలు వ్యాపించాయి. ఆ మంటలతో విషవాయులు వెలువడగా గనిలో ఉన్న నలుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురైన జనరల్ అసిస్టెంట్ దాసరి అన్వేష్, ఫిట్టర్ రాయారపు రంజిత్, సపోర్టుమెన్ ట్రైనీ ఓ. రఘులు ముందుగా అస్వస్థతకు గురై బయటకు వచ్చి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వెంటనే అధికారులు గమనించి వారిని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరో వ్యక్తి జనరల్ అసిస్టెంట్ (పంప్ ఆపరేటర్)గా విధులు నిర్వర్తిస్తున్న సొన్నాయిల క్రాంతికుమార్ గనిలోనే ఇరుక్కుపోగా బయటకు రాలేని పరిస్థితి (మిగతా 8లో..)

పటిష్టమైన విద్యను అందించాలి



అభిప్రాయాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

తొర్రూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంతో పాటు నిర్దిష్టమైన విద్యను అందించి విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలని తొర్రూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కమలాదేవి అన్నారు. గురువారం గత మూడు రోజులుగా అంగన్‌వాడీ టీచర్‌లకు పోషణ్ బీ పడాయ్ బీ శిక్షణ ముగింపు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సమర్థవంతమైన పోషకాహారం అందిస్తున్నామని, దానిని వినియోగించుకోవాలన్నారు. చిన్నారుల ఎదుగుదల, మహిళల ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే పోషణ మాసంలో అంగన్‌వాడీ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు, పోషకాహారంపై చర్చ ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తైన అంగన్‌వాడీలు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, సంకీర్తన, మల్లీశ్వరి, శోభ, గౌస్య, శోభ, నాగమణి తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



మైక్‌సెట్‌ను అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పెద్దవంగర, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ వంతు సహకారం అందించాలని హెచ్‌ఎంలు రమేశ్, బానోతు భీమానాయక్ అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురం ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి తొర్రూరు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్‌ఆర్య రాజేశ్వరి దంపతుల సహకారంతో రూ.18వేలు విలువ చేసే మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నవ సమాజ నిర్మాణానికి లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి తొర్రూరు సేవలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రవీందర్, శ్రీను, శంకర్, ఉపాధ్యాయులు చిరంజీవి, ప్రతిభ, రజిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల కొలిమి!

- మైనారిటీ కాలనీలో వానొస్తే నరకం
- ఇళ్ల మధ్యలో మురికి గుంతలు
- పందుల స్వైరవిహారం
- అధ్వానంగా రోడ్లు



మురికి గుంతలో పందుల స్వైరవిహారం

మరిపెడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మరిపెడ మైనార్టీ కాలనీ సమస్యల కొలిమిగా నిలిచింది. ఇళ్ల మధ్యలోనే మురికి గుంటలు ఉండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వానొస్తే.. కాలనీ రోడ్లపై నడక నరకంగా మారిందని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. మురికి గుంటల్లో నీరు నిలవడంతో దోమలు, ఈగలు చెవ్వులు గివ్వుమనేలా జువ్వుమని తిరుగుతున్నాయని మైనార్టీ కాలనీ వాసులు గుండెలు పిండుకుంటున్నారు. ఆ కాలనీకి అప్పుడప్పుడు నల్లా నీళ్లు ఇస్తారు. బోరు ఒక్కటే తాగు నీటికి దిక్కుగా ఉంది. మరో బోరు పాడైనా అధికారులకు పట్టింపు లేదని అక్కడి ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఓట్లప్పుడు టోపులు పెట్టి భూమి తల్లి సొట్టుపోయేలా కొలుస్తున్నరే తప్ప రోడ్లు వేసిన పాపం ఎరగమని జనం గగ్గోలు పెడుతున్నారు.

30ఏళ్లుగా మైనారిటీ వాసుల గోస

గత 30 ఏళ్లుగా మరిపెడ మైనార్టీ కాలనీ ప్రజలు అరిగోస పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ నిర్మాణం అప్పుడు ఎట్లా ఉందో ఇప్పటికి ఏ మాత్రం అభివృద్ధికి నోచు కోక అట్లనే ఉందని కంట కన్నీరు తీస్తున్నారు. నీళ్ల కోసం నెత్తికాయలు కాసేలా బిందెలతో మోసుకొస్తున్నామని మహిళలు కన్నీటి పర్యాంతం చెందుతున్నారు. దీనికి తోడు డ్రైనేజీ కాలువలు లేక వర్షకాలం ఇళ్ల మధ్యలోనే మురికి గుంటలో నీరు నిలిచి పందులు, దోమలు, ఈగల సహ జీవనం చేస్తున్నామని గుర్తు చేస్తున్నారు.



పాడైన బోరు



మరిపెడ మైనార్టీ కాలనీలోని రోడ్డు దుస్థితి

తాగు, వాడకం నీటికి బోరే దిక్కు..

మైనార్టీ కాలనీలో 100 కుటుంబాలకు పైగా జీవనం చేస్తున్నారు. ఆ కుటుంబాలకు ఒక్కటే బోరు తాగు, వాడకం నీటికి దిక్కయింది. ఇంకో బోరు పాడై ఏళ్లు గడుస్తున్నా అధికారులకు పాలకులకు గింత పట్టింపులేదని భగ్గుమంటున్నారు. వీధి లైట్లు వెలిగితే పగలు, రాత్రి వెలుగుతాయని, లేకుంటే చిమ్మచీకట్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది.



ఇళ్ల మధ్య ఉన్న మురికి గుంట

వానొస్తే రోడ్లన్ని బురదమయం..

సీసీ రోడ్లు లేక కాలనీలోని రోడ్లన్ని వానొస్తే బురదమయంగా మారుతాయని కాలనీ ప్రజలు చెబుతున్నారు. ఆర్‌జేఆర్‌ఎం డిగ్రీ కళాశాల నుంచి మైనార్టీ కాలనీ వరకు మట్టి రోడ్డే. కాలనీ అంతర్గత రోడ్లు సైతం మట్టి రోడ్లు కావడంతో చిరు జల్లులకే రోడ్లన్ని బురదతో ఉంటాయి. వృద్ధులు, బడిపిల్లలు నిత్యం నరకం భరిస్తారని కాలనీ వాసులు వాపోతున్నారు. మైనార్టీ కాలనీ ఇళ్ల చుట్టు ముళ్ల కంప చెట్లు వ్యాపించి జనం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, మునిసిపల్ అధికారులు మైనార్టీ ప్రజల ఇబ్బందులు తొలిగించాలని వేడుకుంటున్నారు.

మైనారిటీ కాలనీపై సీతకన్ను..

ఎస్కేమహబూబీ, మైనారిటీ కాలనీ, మరిపెడ బంగ్లా



మరిపెడ మైనార్టీ కాలనీపై సర్కారోళ్లు సీత కన్ను పెట్టి సమస్యలతో మమ్ములను సహసం చేసేలా చూస్తున్నారు. మట్టి రోడ్లు వానం కాలం బురద రోడ్లుగా మారి అడుగేస్తే అంతే అన్న సంగతులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా మైనార్టీ కాలనీ వాసుల ఇబ్బందులు తీర్చాలి.

పన్నులు చెల్లిస్తున్నా పట్టింపేది?

భూపలి విజయ, మైనారిటీ కాలనీ, మరిపెడ బంగ్లా



ప్రతీ సంవత్సరం నల్లా పన్ను, ఇంటి పన్నులు చెల్లిస్తున్నా మైనార్టీ కాలనీ ప్రజలకు ఇక్కట్లు తప్పట్లేదు. డ్రైనేజీ కాలువలు లేక ఇళ్ల మధ్యనే మురికి గుంటలు ఉండి దోమలు, ఈగలు కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి.

రూ.15కోట్లతో ప్రతిపాదనలు రెడీ

విజయానంద్, మరిపెడ మునిసిపల్ కమిషనర్

మరిపెడ మైనార్టీ కాలనీ, గోపాలపురం, పూల బజారు, ఆర్టీసీ కాలనీతో పాటు తదితర కాలనీల రోడ్లు, సైడ్ డ్రైనేజీ కాల్వల అభివృద్ధి కోసం 15 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినాము. త్వరలోనే నిధులు మంజూరి అవుతాయి టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

ప్రారంభానికి నోచుకోని గోపాల మిత్ర భవనం

- సీపీఐ మండల కార్యదర్శి బాలకృష్ణ

మరిపెడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలం పూర్తి అవుతున్న మండలంలోని నీలికుర్తిలో ఉన్న గోపాల మిత్ర భవనం ప్రారంభానికి నోచుకోలేదని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు.ఈ మేరకు గురువారం జిల్లా పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీలికుర్తిలో ఉన్న గోపాలమిత్ర భవనం పది సంవత్సరాల క్రితం మంజూరై భవనం పూర్తైందన్నారు. ఈ భవనం పూర్తి కావడంతో నీలికుర్తి, ఆనేపురం, బావోజిగూడెంలలో పశువులకు ఉపయోగపడేందన్నారు. అయితే భవనం శిథిలావస్థతకు చేరిందన్నారు. పశు సంపదను దృష్టిలో పెట్టుకొని తక్షణమే గోపాల మిత్ర భవనాన్ని ప్రారంభించాలని జిల్లా పశువైద్యాధికారి కోరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఎండీ అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు



తొర్రూరులో రిపేర్ చేస్తున్న సిబ్బంది

తొర్రూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణ కేంద్రంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ కోతలపై అధికారులు తగిన సమాచారం ఇవ్వకుండా పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మెయిన్ రోడ్డుపై వివిధ వ్యాపారాలు నిర్వహించుకునే వారు విద్యుత్ సరఫరా లేకపోవడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు విద్యుత్ నిలిపివేతపై తగిన సమాచారం అందించే వారని, పట్టణంలో విధులు నిర్వహిస్తున్న ఏఈ, లైన్‌మెన్ లాంటి అధికారులు స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో ఉన్నా వాటిలో సమాచారం అందించడం లేదని, దీనికి తోడు విద్యుత్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం తొర్రూరులో ఉన్నప్పటికీ సంబంధిత డివిజనల్ అధికారి స్థానికంగా ఉండకపోవడంతో ఏడీలు, ఏఈలు, లైన్‌మెన్‌లు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని, ఫోన్‌లో కూడా అందుబాటులోకి రావడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ నిలిపివేతపై తగు సమాచారం అందించాలని కోరుతున్నారు.



పరామర్శకు వెళ్లొస్తూ.. తనువు చాలించిన వృద్ధురాలు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్
- ఆడబిడ్డ చనిపోగా వెళ్లి వస్తుండగా ప్రమాదం
- వర్ధన్నపేటలోని డీసీ తండా వద్ద ఘటన
- వృద్ధురాలి దుర్మరణం, కొడుకుకు తీవ్ర గాయాలు



డీసీతండా వద్ద లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన గుగులోతు రేషమ్మ, గాయాలపాలైన కుమారుడు తుకారాం

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చావింటికి వెళ్లి తిరిగి తమ ఇంటికి పోతుండగా ఆ వృద్ధురాలిని మృత్యువు కబలించింది. ద్విచక్ర వాహనాన్ని ఆయిల్ ట్యాంకర్ వెనక వైపున తాకడంతో లారీ వెనక టైర్ల కిందపడి వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా, కొడుకుకు తీవ్ర గాయాలు కాగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహబూబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కమ్మెనపెల్లి తండాకు చెందిన గుగులోతు రేషమ్మ(56) తన భర్త నాను, పెద్ద కుమారుడు తుకారాం, చిన్న కుమారుడు వెంకన్నలతో కలిసి తెట్టెకుంట తండాలో చావింటికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్నారు. తన ఆడబిడ్డ ఇస్లావత్ దస్లీ అనారోగ్యంతో చనిపోగా రెండో రోజు కార్యక్రమంలో పాల్గొని ఇంటికి వెళ్తున్నారు. ఈ తరుణంలో పెద్ద కుమారుడైన తుకారాం టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై తల్లి రేషమ్మ, చిన్న కుమారుడు వెంకన్న వాహనంపై నాను వెళ్తున్నారు. వెంకన్న వాహనం ముందుగా వెళ్తుండగా వెనక నుంచి వస్తున్న తుకారాం డీసీ తండా దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ తుకారాం వాహనానికి వెనక వైపు అదుపు తప్పి ఢీకొంది. దీంతో లారీ వెనక టైర్లు వృద్ధురాలిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తుకారాంకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ సహాయంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట అదనపు ఎస్‌ఐ మేరుగు రాజు సంఘటన స్థలానికి చేరుకున్నాడు. మృతదేహన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించాడు. కాగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని అప్పగిస్తామని తెలిపారు.

విద్యుత్ అధికారులు మీకిది తగునా..!

వివిధ కారణాలతో చనిపోయిన వ్యక్తుల మృతదేహాలను తీసుకువచ్చే వర్ధన్నపేట సంగెపు వాగు వద్ద ఉన్న పోస్టుమార్టం గది వద్ద విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందిగా మారింది. ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పోస్టుమార్టం నిర్వాహకులు చెబుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం చేసి భద్రపరిచే గది ముందు కరెంటు సరఫరా అయ్యే ప్రధాన సర్వీసు వైరు నేలపై సప్లయి కావడంతో బాధిత కుటుంబాలను భయాందోళనకు గురిచేస్తోంది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక స్తంభాన్ని ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

జీవో 64ను వెంటనే రద్దు చేయాలి

ఐటీడీఏ ఎదుట కళ్లకు రిబ్బను కట్టుకుని కార్మికుల వినూత్న నిరసన



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన చేస్తున్న దినసరి కార్మికులు

ఏటూరునాగారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల దినసరి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వర్కర్లు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈనెల 17న ములుగులో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వర్కర్ గగులోతు శ్రీను ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్, ఉపాధ్యక్షుడు మడే రవిలు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2014లో తీసుకొచ్చిన జీవో 212 ప్రకారం ఐదేళ్లు పూర్తయిన వర్కర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 64ను అమలు చేస్తామనడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. ఈ జీవో ప్రకారం నెల జీతంలో సగం తగ్గించే అవకాశం ఉందని, దీని వల్ల వర్కర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండలో 20 మంది వర్కర్లకు టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని, అదేవిధంగా ఇక్కడ కూడా అమలు చేయాలని లేని పక్షంలో పాత పద్ధతి ప్రకారం కలెక్టర్ గెజిట్ వేతనాలను అమలు చేయాలని కోరారు. నిధులు ఉన్నప్పటికీ ఆరు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పైరవీలు, లంచాలతో కొత్త పేర్లను నమోదు చేసి అసలైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వర్కర్లకు ప్రమాద బీమా కింద రూ. 10 లక్షలు ఇవ్వాలని, జీతంతో కూడిన వారాంతపు సెలవులు, రెండు జతల యూనిఫామ్, గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో దినసరి కార్మికుల నాయకులు ఎం. నాగలక్ష్మి, జి. విజయలక్ష్మి, కమల, జయలక్ష్మి, నాగమణి, సరోజన, సారబాబుతో పాటు సుమారు 140 మంది వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన వరం


- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన ఓ వరమని, దానిని సార్థకత చేసుకున్నప్పుడే సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవ మర్యాదాలు ఉంటాయని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మరిపెడబంగ్లా సీతారాంపురం హైస్కూల్ హెచ్‌ఎం రాంచంద్రయ్య ఉద్యోగ వీరమణ చేయగా ఆ దంపతులను నర్సిరెడ్డి సత్కరించి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ ఓ మజిలీగా మిగిలిపోతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఆ స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి మృతి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పశువులను ఢీకొట్టగా, ఓ పశువు కాపరిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ జాతీయ రహదారిపై ఏటిగడ్డ తండా వద్ద చోటు చేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ జి.మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మహబూ బాబాద్ జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్‌కాలనీకి చెందిన గంగుల వెంకన్న (50) కొద్దికాలంగా పశువులను కాస్తూ జీవిస్తున్నాడు. రోజువారి మాదిరిగానే గురువారం మధ్యాహ్నం తనకు ఉన్న పశువులను జమాం డ్లపల్లి బ్రిడ్జి వద్ద మేపుకొని, తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఏటిగడ్డ తండా వద్ద పశువులను ఢీ కొన్నది. గాయాలైన ఓ గేదె కాపరి వెంకన్నపై పడటంతో ఊపిరి ఆడకపోవడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి



కేజీబీవీలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దవంగర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో వేణుమాధవ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పరిశుభ్రత పనులను ప్రారంభించి చెత్త తొలగింపు, డ్రైనేజీ, వీధుల పరిశుభ్రత వంటి కార్యక్రమాలను చేపట్టారు. అలాగే స్వచ్ఛోత్సవ్ పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో బుధారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తాడ్వాయి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంకేంద్రం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యం అయింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై భిక్షాటన చేస్తూ జీవిస్తున్న మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరారు.

దామెర చెరువుపై నిర్లక్ష్యమేల?



దామెర చెరువు కట్టను కమ్మేసిన చెట్లు

- 6 నెలలుగా తెరుచుకోని ప్రధాన తూము
- రెండో తూము నుంచి వృథాగా పోతున్న నీరు
- మునుగుతున్న పంటలు.. నష్టపోతున్న రైతులు
- కోతకు గురై చెట్లు, పొదలతో నిండిన కట్ట
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు, పాలకులు

కరీమాబాద్(వరంగల్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీటి పారు దల శాఖ అధికారుల నిర్లక్ష్యం అక్కడి రైతులకు శాపంగా మారింది. ఆర్నెల్లుగా తూము తెరుచుకోకున్నా పట్టించుకున్న నాథులే లేరు. వర్షాలతో కట్ట.. కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతున్నా, చెట్లు పొదలతో చిట్టడవిని తలపిస్తున్నా చర్యలు కానరావడం లేదు. ఇది ఖిలా వరంగల్ మండల పరిధిలోని దామెర చెరువు దుస్థితి.

నగర పరిధిలో వున్న దామెర చెరువు కింద దాదాపు 250 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇక్కడ రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు వరి సాగు చేస్తున్నారు. చెరువు ఒక్కసారి నిండితే రెండు పంటలు గ్యారెంటీ. ఈ చెరువుకు రెండు తూములు వున్నాయి. ఇందులో ఒకటి తూర్పు తూము కాగా, మరొకటి గణేశుడి తూము. ఆయకట్టు సాగుకు తూర్పు తూమే ప్రధానమైనది. యాసంగి సీజన్ నుంచే ఇది తుప్పు పట్టి తెరుచుకోకుండా మొరాయిస్తోంది. వానాకాలం సీజన్‌లో రైతులు నార్లు పోసి వరినాట్లు వేసుకునే దశలోనూ ఇది తెరుచుకోలేదు. దీంతో గణేశుడి తూము నుంచి లీకయ్యే నీటినే రైతులు సాగుకు ఉపయోగించుకుంటున్నారు.

వరుస వర్షాలతో ప్రస్తుతం చెరువు పూర్తిగా నిండింది. ప్రధాన తూముకు మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు అనేకమార్లు విన్నవించారు. అయితే తూమును రిపేరు చేయాలంటే గజ ఈతగాళ్ల అవసరమని, వారు తమకు దొరకడం లేదని, మీరే తెచ్చుకోండని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని అధికారులు చెప్పారని, ఈ విషయంలోనూ శ్రద్ధ పెట్టడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. 'గణేశుడి తూము లీకేజీతో కట్టకు దగ్గరగా వున్న వరి పొలాలు నీట మునుగుతున్నాయి. అలాగే పలువురు రైతుల పొలాలు బుడుగులా మారి సాగుకు పనిరాకుండా పోతున్నాయి... 24 గంటలు నీళ్ల వృథాగా బయటకుపోతున్నాయి..' అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రధాన తూము మరమ్మతులు చేపట్టి, పంట కాల్వలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా చెరువు కట్ట

దామెర చెరువు ప్రధాన తూము పరిస్థితి ఇలా ఉంటే, చెరువు కట్టను ఎవరూ పట్టించుకోవడం లేదు. వరుస వర్షాలతో కట్ట రెండు చివరలా కోతకు గురైందని, దీంతో కట్ట పరిస్థితి ప్రమాదకరంగా మారిందని రైతులు తెలిపారు. ఈ కట్ట తెగితే నగరానికి పెను ప్రమాదమని వారు చెబుతున్నారు. ఇక కట్టపైన చెట్లు, పొదలు విపరీతంగా పెరిగాయి. బయటనుంచి చూస్తే కట్ట ఏ మాత్రం కనిపించడం లేదు. కట్టపైకి వెళ్లడానికి కనీసం దారికూడా లేకుండా పోయింది. కట్ట పటిష్టతను, శుభ్రతను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని స్థానిక రైతు, రిటైర్డు జైలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

పదేళ్ల కిందట రూ.అర కోటి ఖర్చు

ఇప్పటి మంత్రి కొండా సురేఖ 2015 లో ఎమ్మెల్యేగా వున్నప్పుడు 'మిషన్ కాకతీయ'లో భాగంగా చెరువు పునరుద్ధరణ పనుల పేరుతో రూ.53 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అప్పుడు కట్ట మరమ్మతు పనులు చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు చెరువుకు ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదని రైతులు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల ఆదరణకు నోచుకోకుండా పోతున్న దామెర చెరువుపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ మళ్లీ దృష్టి సారించాలని, అలాగే చెరువు వద్దకు వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారినందున, మసీదు బండ నుంచి కట్ట వరకు రోడ్డు నిర్మాణానికి నిధులివ్వాలని నీటి వినియోగ దారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు.

పర్యాటక అవకాశాలు

దామెర చెరువును జక్కలొద్ది సమీపంలోని దామెరగుట్టలు, బోడగుట్టకు మధ్య నిర్మించారు. ఇది కాకతీయుల నాటి గొలుసుకట్టు చెరువుగా చెబుతారు. వందలాది ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువు.. అనేక దశాబ్దాలుగా అటు వ్యవసాయదారులు, ఇటు మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తోంది. నగరానికి సమీపంలో ఉండటంతో భవిష్యత్తులో దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 'కుడా' అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. కాకతీయుల కాలం నాటి భారీ వినాయక రాతి విగ్రహం ఈ చెరువుకు ప్రధాన ఆకర్షణ. అలాగే చెరువుకు ఇరుపక్కలా వున్న గుట్టల్లో ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్లు, జైనుల సంస్కృతికి సంబంధించిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ చెరువు నగరానికి చేరువలో ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు ఇక్కడి స్వచ్ఛమైన నీటిలో నిత్యం ఈత కొడుతుంటారు. అటు వ్యవసాయానికి, ఇటు పర్యాటకానికి అనువుగా వున్న దామెర చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని రైతులు, పర్యాటక ప్రేమికులు కోరుతున్నారు.



దామెర చెరువులో పనిచేయని ప్రధాన తూము ఇదే..

అరచేతిలో వ్యవసాయం

- వాట్సాప్ చానల్ క్రియేట్ చేసిన వ్యవసాయశాఖ
- రైతులకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు
- నూతన సాంకేతికత, పరికరాల సమాచారం



వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా, త్వరగా రైతులకు చేరవేసేందుకు వ్యవసాయ శాఖ వాట్సాప్ చానెల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుత రోజుల్లో ప్రతీ రైతు వద్ద అండ్రాయిడ్ సెల్‌ఫోన్ ఉంటోంది. సంబంధిత మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే ఆ చానల్‌లో రైతులను చేరుస్తారు. దీని ద్వారా వ్యవసాయంలో కాలానుగణంగా వస్తున్న మార్పులను, మెళకువలను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అధిక ఆదాయాన్ని పొందేందుకు సలహాలు, సూచనలు అందిస్తారు. అంతేగాకుండా పంటల దశను బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు కావాల్సిన సమాచారాన్ని అందజేస్తారు. ఇప్పటికే వరంగల్ జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు ఈ వాట్సాప్ చానెల్‌లో లాగిన్ అయ్యారు. తొలుత ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) 100 మంది రైతుల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ఆదేశించారు.

రైతులకు లభించే సమాచారం

- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు.
- పంటల సంరక్షణ కాలానుగుణ సూచనలు.
- వాతావరణ హెచ్చరికలు, కీటక నియంత్రణ మార్గదర్శకాలు.
- మార్కెట్ ధరలు, శిక్షణా కార్యక్రమాలు.
- రైతు నేస్తం కార్యక్రమాల షెడ్యూల్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా సమావేశాలు.

రైతులకు ఎంతో మేలు

కె. అనురాధ, డీఏవో



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ చానెల్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా దీన్ని రూపొందించారు. పంట పరిస్థితి. దానికి కావాల్సిన ఎరువులు, క్రిమి సంహారక మం దులు ఎలా వాడాలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా అధికారులు, శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇస్తారు.

వాట్సాప్ చానెల్‌తో ఉపయోగం

ఆర్. శ్రీనివాస్, రైతు, మొగిలిచర్ల



పంట దిగుబడి అధికంగా రావాలని విచ్చలవిడిగా ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దిగుబడి తగ్గిపోతోంది. వ్యవసాయశాఖ కొత్తగా తీసుకు వచ్చిన వాట్సాప్ చానెల్‌తో సెల్‌ఫోన్‌లోనే అన్ని విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది. గతంలో మాదిరిగా వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లి సమస్యలను చెప్పుకునే అవస్థలు ఇప్పుడు తప్పింది. దీంతో రైతులకు సమయం కలిసి వస్తుంది. సాగులో ఖర్చు తగ్గి అధిక దిగుబడి, ఆదాయాన్ని పొందేందుకు వీలుపడుతుంది.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, ట్రస్మా బాధ్యులు

ప్రైవేటు టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా..

- ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమైనది..
- విద్యారంగంలో వారి పాత్ర కీలకం
- నాణ్యమైన విద్యను అందించాలి
- ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

కరీమాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ ఉర్సుగుట్ట బైపాస్ రోడ్డులో గల నాని గార్డెన్స్‌లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో ప్రైవేటు ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమైనదని, విద్యారంగాన్ని పటిష్ట పరచడంలో ప్రైవేటు విద్యాసంస్థలు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, భావితరాలకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డితో విద్యారంగంపై చర్చ జరిగిందని, విద్యావంతులతో నిర్వహించిన సమావేశం అనంతరం తెలంగాణలో డిసెంబరు 9న విద్యారంగంపై నూతన పాలసీని తీసుకురాబోతుందని తెలిపారు. సుమారు 60లక్షల మంది విద్యార్థులు పదవ తరగతిలో అభ్యసిస్తున్నారని అన్నారు. తాను ఉద్యోగంలో ఉన్న సందర్భంలో 35లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటే, 25లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో ఉండేవారని, ప్రస్తుతం అన్ని రకాల గురుకుల పాఠశాలల్లో చూసినట్లైతే 23లక్షలు, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో 17లక్షల మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారని, మిగితా విద్యార్థులంతా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.

దీన్ని బట్టి విద్యారంగానికి ప్రైవేటు విద్యా వ్యవస్థ ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి ఉచిత చికిత్స పాలసీ, హెల్త్ కార్డులను అందించేలా చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి దండపంతుల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఠాణాలు ఎప్పుడో..?!

(5వ పేజీ తరువాయి)

మరిన్ని పోలీస్‌స్టేషన్లు అవసరంగా గుర్తించారు. 2018లోనే ములుగు జిల్లా మేడారంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. మేడారంలో నిత్యం పూజలు జరుగుతుండటంతో పాటు వేలాది మంది భక్తులు రోజు వస్తుండటంతో ఇక్కడ ప్రత్యేక పోలీస్టేషన్ అవసరంగా గుర్తించి ప్రతిపాదనలు పంపించారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. కానీ, ఇప్పటి వరకు సిబ్బంది కేటాయింపులు చేసి, స్టేషన్ ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం రిజర్వుడు పోలీసులకు షెల్టర్‌గా మారింది.

ఇక ములుగు జిల్లా వెంకటాపురం మండలం అలుబాకలో కూడా పోలీస్‌స్టేషన్ కోసం 2018లోనే ప్రతిపాదనలు చేశారు. చత్తీస్‌గడ్‌కు సరిహద్దులో ఉండటంతో మావోయిస్టుల ఉనికితోపాటు గంజాయి లాంటి అక్రమ దందాను అరికట్టేందుకు అలుబాక స్టేషన్ అవసరంగా గుర్తించి చేసిన ప్రతిపాదనలు ఏడేళ్లుగా కాగితాల్లోనే మూలుగుతున్నాయి. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నడికూడ గ్రామాన్ని 2018 ఆగస్టు 27న నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే కొత్త మండలానికి పోలీస్‌స్టేషన్‌ను ఇవ్వలేదు. ఏడేళ్లుగా పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలోనే కొనసాగుతోంది. దీంతో శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోంది.

తాజాగా వరంగల్ నగరంలో కొత్తగా రెండు పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. సుబేదారి, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధి ఎక్కువగా ఉండటంతో పునర్విభజన చేసి మరో రెండు కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఇవీ కూడా అమలుకు నోచుకోలేదు. దీంతో నగరంలో శాంతిభద్రతల బాధ్యతలు ఖాకీలకు భారంగా మారుతున్నాయి. దొంగతనాలు, గంజాయి స్మగ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు..

కొత్తగా జిల్లాలు ఏర్పడటం.. నగరం భారీగా విస్తరిస్తుండటంతో జనాభా సైతం భారీగా పెరుగుతోంది. దీంతో రహదారులు జామ్ అవుతున్నాయి. వరంగల్ నగరంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు కేయూ పరిధిలో మరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. హసన్‌పర్తి, ఎల్కతుర్తి వరకు నగరంలో కలిసిపోయింది. వడ్డెపల్లి, హనుమకొండ ఆర్టీసీ డిపో ఏరియా మొత్తం కూడా కాజీపేట ట్రాఫిక్ పరిధిలో ఉండటం పోలీసులపై భారం పడుతోంది. కాజీపేట నుంచి మడికొండ, పెద్దపెండ్యాల నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు నగరం విస్తరిస్తుంది. ఈ క్రమంలో కాజీపేట ట్రాఫిక్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో కేయూ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఏడేళ్ల కిందట చేసిన ప్రతిపాదనలకు మోక్షం లభించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అలాగే కొత్తగా మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలో కూడా మరో ట్రాఫిక్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పార్కు విస్తరిస్తుండటంతో ట్రాఫిక్ భారీగా పెరుగుతోంది. ఈ ప్రాంతం లో కూడా మరో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. ఇక కొత్తగా ఏర్పడిన భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని 2019లోనే ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. భూపాలపల్లిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కోసం 2020లోనే స్థల సేకరణ కూడా చేశారు. ఇప్పటివరకు కొత్త జిల్లాల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఊసే లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోం శాఖ మంత్రిగా ఉండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఏర్పాటు చేయాల్సిన నూతన ఠాణాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లపై అధికారి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థాయి పెంచరు.. సిబ్బందిని ఇవ్వరు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సెలవు పెట్టాలన్న పోలీసులకు నిరీక్షణ తప్పటం లేదు. ప్రధానంగా కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినప్పుడు ఎఫ్ గ్రేడ్ కేటగిరీలో సిబ్బంది నియమిస్తారు. ఎఫ్ కేటగిరీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ కలిపి మొత్తం 28మంది ఉండాలి. అయితే ఇటీవల కొత్తగా భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం ఏర్పాటు చేశారు. ఈ మండల పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్సై, మరొకరు సెంకడ్ ఎస్సైతో పాటు ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్, ఆరుగురు కానిస్టేబుల్స్, ఒక మహిళ కానిస్టేబుల్‌ను నియమించారు. మొత్తం 12మంది మాత్రమే గోరికొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. 28మంది సిబ్బంది చేయాల్సిన పనిని 12మందితో చేయిస్తున్నారు. దీంతో సెలవు పెట్టే అవకాశం పోలీసులకు దొరకటం లేదు.

అలాగే ఈ కేటగిరి పోలీస్‌స్టేషన్‌లో 45మంది, డీ కేటగిరి స్టేషన్‌లో 55మంది సిబ్బంది డ్యూటీస్ చేయాల్సి ఉంటుంది. అయితే ఏళ్ల తరబడి ఏ పోలీస్‌స్టేషన్ స్థాయిని కూడా పెంచటం లేదు. ఏ కేటగిరిలో ఉన్న సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించటం లేదు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీ స్‌స్టేషన్లలో పోలీసులకు సెలవులు బంగారమయ్యా యి. పండుగలు, పబ్బాలుకు కూడా సెలవుల కోసం నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి కొత్త ఠాణాలతో పాటు నగరాల్లో కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయటంతో పాటు పోలీస్‌స్టేషన్ల స్థాయిని పెంచి సిబ్బంది నియామకం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

సహకారం.. సంక్షేమం..



ముల్కనూర్ సహకార బ్యాంకు వరి విత్తనాలు

- అన్నదాతల సేవలో తరిస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు
- ఏటా రూ.410 కోట్ల వ్యాపార లావాదేవీలు
- రైతులకు రూ.250 కోట్ల రుణాలు
- నేడు ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభ

భీమదేవరపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు ముందే ముల్కనూర్ సహకార బ్యాంకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మార్గదర్శకంగా నిలుస్తోంది. విత్తనం నాటే దగ్గరి నుంచి ధాన్యం కొనుగోలు చేసే వరకు అన్నదాతకు అండగా ఉంటుంది. పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంతో పాటు ధాన్యాన్ని అమ్మితే వచ్చిన లాభాలను రైతులకే బోనస్ రూపంలో చెల్లించడం ఇక్కడి ఆనవాయితీ. 20 ఏళ్లలో దాదాపుగా రూ.100కోట్ల రాయితీలను అందించింది. ఎన్నో రాష్ట్రస్థాయి అవార్డులతో పాటు జాతీయ ఉత్తమ సహకార సంఘంగా ఎన్నికైంది. దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ముల్కనూర్ బ్యాంకు ఉపాధ్యక్షుడిగా పనిచేసి చనిపోయేంత వరకు బ్యాంకు సభ్యుడిగా కొనసాగారు. దేశంలోని సహకార సంఘాలతో పాటు, పలు ప్రపంచ దేశాల్లోని సహకార సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు 69వ వార్షికోత్సవం ఈ నెల 19న జరుగనుంది.



ముల్కనూర్ సహకార బ్యాంకు

రూ.410 కోట్ల వార్షిక టర్నోవర్

ముల్కనూర్ సహకార బ్యాంకు ఈ ఏడు రూ.410కోట్ల వార్షిక టర్నోవర్ చేపట్టింది. ఇందులో రూ.250కోట్లు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను రైతులకు అందించింది. రైతులు పండించిన పత్తి, వరి, సీడ్ వరి ధాన్యాన్ని రూ.96కోట్లతో బ్యాంకు కొనుగోలు చేసింది. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు రూ.30కోట్ల వరకు అమ్మకాలు సాగాయి. రైతులు బ్యాంకులో 7600 మంది సభ్యులుండగా అందులో రైతులు తీసుకున్న రుణాల్లో 99శాతం రికవరీ అయ్యాయి.

రూ.10 కోట్లతో సంక్షేమ పథకాలు

ముల్కనూర్ సహకార బ్యాంకు రూ.10కోట్లతో 2024-25 సం వత్సరంలో రైతులు, వారి పిల్లలకు సంక్షేమ పథకాలు అందజేసింది. రూ.2కోట్ల బోనస్, రూ.60లక్షలు విద్యార్థుల స్కాలర్‌షిప్ లు, హెల్త్ కోసం రూ.70లక్షలు, కళ్ల ఆపరేషన్ల కోసం రూ.70 లక్షలు తదితర సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది

విత్తనాలు.. బియ్యం..

ముల్కనూర్ సహకార బ్యాంకులో నాణ్యమైన విత్తనాలను రాష్ట్రంతో పాటు చత్తీస్‌గడ్, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు వరి సన్న, దొడ్డు రకాల విత్తనాలను అమ్ముతున్నారు. ముల్కనూర్ బ్యాంకు వరి విత్తనాలంటే వివిధ ప్రాంతాల్లో హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోతున్నాయి. ముల్కనూర్ బ్యాంకు రైతుల కోసం చేపట్టిన వరి సీడ్ విత్తనాలు నాణ్యంగా ఉండడంతో దాదాపుగా యేటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు రూ.70 నుంచి రూ.80కోట్ల వరకు వరి విత్తనాలు అమ్ముడుపోతున్నాయి. అలాగే ముల్కనూర్ సహకార బ్యాంకు నాణ్యమైన బియ్యం అమ్ముతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు వివిధ దేశాలకు ముల్కనూర్ బియ్యాన్ని అమ్ముతున్నారు. ఆర్ఎన్ఆర్, బీపీటీ, జైశ్రీరాం లాంటి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.



రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల బస్తాలు

వార్షిక సభలో సంక్షేమ పథకాలు ప్రకటిస్తాం..

అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్



ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభలో రైతులకు పలు సంక్షేమ పథకాలను ప్రకటిస్తాం. రైతులకు అండగా ముల్కనూర్ బ్యాంకు నిలుస్తోంది. రైతుల సంక్షేమం కోసం అవసరానికి అనుగుణంగా అనేక కొత్త పథకాలను తీసుకొస్తున్నాం. 20 ఏళ్లలో దాదాపుగా రూ.100కోట్ల రాయితీలను ఆ రైతులకు అందించాం. భవిష్యత్‌లో రైతుకు బ్యాంకు భరోసాగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం. బ్యాంకులో సీనియర్ సభ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నాం. గృహ, విద్య, వైద్యం కోసం రుణాలు అందిస్తున్నాం.

వరంగల్ మీదుగా అమృత్ భారత్

- 25 నుంచి నాన్ ఏసీ వీక్లీ ఎక్స్‌ప్రెస్
- ఈరోడ్ (తమిళనాడు) వైపు మంగళవారం
- జోగ్బని (బిహార్) వైపు గురువారం అర్ధరాత్రి

గిర్మాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు-బిహార్ రాష్ట్రాల మధ్య సాధారణ ప్రజలు వరంగల్ మీదుగా రాకపోకలు సాగించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన ఈరోడ్-జోగ్బని నాన్ ఏసీ అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25వ తేదీ నుంచి వరంగల్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ రైలు 25న ఈరోడ్(తమిళనాడు), 28న జోగ్బని(బిహార్) నుంచి ప్రారంభం అవుతుంది. ఈరోడ్-జోగ్బని అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్(16601) ప్రతి గురువారం ఉదయం 8.10 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి సాయంత్రం 4.40 గంటలకు గూడూరు, సాయంత్రం 6.58 గంటలకు ఒంగోలు, రాత్రి 9.15 గంటలకు విజయవాడ, రాత్రి 11.09 గంటలకు ఖమ్మం, గురువారం అర్ధరాత్రి(శుక్రవారం) 0.53 గంటలకు వరంగల్, శుక్రవారం ఉదయం 2.59 గంటలకు మంచిర్యాల, శనివారం రాత్రి 7 గంటలకు జోగ్బని(బిహార్)కి చేరుకుంటుంది.

అలాగే జోగ్బని-ఈరోడ్ అమృత్ భారత్(16602) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు జోగ్బని (బిహార్)లో బయలుదేరి మంగళవారం ఉదయం 9.04 గంటలకు మంచిర్యాల, 10.58 గంటలకు వరంగల్, మధ్యాహ్నం 12.24 గంటలకు ఖమ్మం, 2.40 గంటలకు విజయవాడ, సాయంత్రం 5.03 గంటలకు ఒంగోలు, రాత్రి 7.50 గంటలకు గూడూరు, బుధవారం ఉదయం 7.20 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. ఈ రైలుకు తెలుగు రాష్ట్రాల్లో గూడూరు, ఒంగోలు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, మంచిర్యాల స్టేషన్‌లలో మాత్రమే హాల్ట్ ఉందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలులో నాన్ ఏసీ స్లీపర్ కోచ్‌లు 8, అన్ రిజర్వుడు జనరల్ కోచ్‌లు 11, దివ్యాంగుల కోచ్‌లు 2, ప్యాంట్రీకార్ 1 ఉంటుందని, ప్రయాణీకులు ఈ రైలును వినియోగించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.



ఈరోడ్-జోగ్బని మధ్య నడిచే అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు


శిక్షణ తరగతులకు హాజరైన ప్రతినిధులు


గిరిజన భవన్‌లో జ్యోతి ప్రజ్వళన చేస్తున్న దేశీరాంనాయక్

గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● గిరిజన శాఖ జిల్లా డీడీ దేశీరాంనాయక్

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, శిక్షణ పొందిన ప్రతినిధులు అహర్నిశలు కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ గుగులోతు దేశీరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో గురువారం జ్యోతి ప్రజ్వళన చేసి మూడ్రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశీరాంనాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా వెనుకబడి అభివృద్ధికి నోచుకోని గ్రామాలను గుర్తించి గిరిజనుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాలు, తండాల్లో ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనిచేయాలన్నారు. ప్రతీ గ్రామం, తండాలను అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, మోట డీడీ కృష్ణవేణి, ఏసీఎంవో రాములు, జీసీడీవో విజయ, కొమ్మాలు, భాస్కర్, గూడూరు సీడీపీవో నిలోఫర్ అజ్మి పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

టీయూఎఫ్ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల మౌనేందర్

నెల్లికుదురు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా నుంచి ఈ నెల 20న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో చేపట్టే బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీయూఎఫ్ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల మౌనేందర్ పిలుపునిచ్చారు. నెల్లికుదురు మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఉద్యమకారుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పని చేశామని, తెలంగాణ ఏర్పడి దశాబ్దకాలం అవుతున్నప్పటికి ఉద్యమకారుల సమస్యలను పరిష్కంచడంలేదన్నారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం బస్సు యాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండ వెంకన్న, పెరమాండ్ల పుల్లయ్య, దండెంపెల్లి


సమావేశంలో మాట్లాడుతున్న కుమ్మరికుంట్ల మౌనేందర్

సైదులు, దాసరి ప్రకాష్, మాదరి ప్రశాంత్, మద్ది వెంకన్న, కొమురయ్య హెచ్ అశోక్, ఆలకుంట్ల సాయిలు, ఎల్లయ్య, పాల్గొన్నారు.

21న మానుకోటకు బస్సు యాత్ర

● మహబూబాబాద్ టౌన్ : ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌తో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమారపు వీరస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్దకు యాత్రకు చేరుకుంటుందని జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులు, సంఘం అన్ని మండలాల బాధ్యులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

మృతురాలి కుటుంబానికి సాయం

కొత్తగూడ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాసంపల్లిలో మృతురాలి కుటుంబానికి తాటివారివేంపల్లి మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ సురేష్‌నాయక్ ఆర్థిక సహాయం చేశారు. తాటివారి వేంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మాసంపల్లి గ్రామానికి చెందిన అంగోత్ దాల్లీ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ సురేష్‌నాయక్ దాల్లీ మృతదేహం వద్ద నివాళులు అర్పించి, కుటుంబానికి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మృతురాలి కుటుంబానికి రూ, 4వేలు ఆర్థిక సహాయం చేశారు.

పత్తి క్వింటాకు రూ. 10,075 ధర నిర్ణయించాలి

● ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రన్న


అంబేద్కర్ విగ్రహం ఎదుట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చంద్రన్న

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.10,075 నిర్ణయించి, అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికా, ఇంగ్లండ్‌లతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల పత్తి దిగుమతిపై 12 శాతం సుంకాన్ని రద్దు చేశారని, దీంతో పత్తిరైతులకు తీవ్ర నష్టం వాటిల్లె ప్రమాదముందన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 23 వరకు మండల, డివిజన్ కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవుల కట్టయ్య, యాకయ్య, వెంకటయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నూతన దుస్తులు అందచేత


నూతన దుస్తులు అందజేస్తున్న మైస శ్రీనివాస్, జూలకంటి ప్రభాకర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జిల్లా కేంద్రానికి చెందిన దాత సహకారంతో 60 మంది నిరుపేద విద్యార్థులకు టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మైస శ్రీనివాస్, జూలకంటి ప్రభాకర్ రెడిమెడ్ దస్తులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణ కేంద్రానికి చెందిన ఓ దాత సహకారంతో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు నూతన దుస్తులు అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని, ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయుడు దారావత్ భద్రునాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక, సూర్యప్రకాష్, పవన్‌రాజ్, రాచకొండ ఉపేందర్, సూర్యతేజ, శంకర్, శృతి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు

డోర్నకల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం సమీపంలో డోర్నకల్-ఖమ్మం రహదారిలో రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ.. అసహనానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన డోర్నకల్ సీఐ చంద్రమౌళి, ఎస్సై ఖాదర్‌పాషా, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ సర్వర్ పాషాలు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో మట్టిని కంకరతో నింపి దానిపై మట్టిని పోశారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి రోడ్డుపై గుంతలను పూడ్చిన డోర్నకల్ పోలీసుల సేవలను ప్రజలు అభినందించారు. శాంతిభద్రత పరిరక్షణలోనే కాకుండా సామాజిక సేవల్లోసైతం పోలీసులు భాగస్వాములు కావడం సంతోషం వ్యక్తం చేశారు.


డోర్నకల్‌లో గుంతలను మట్టితో పూడ్చివేయిస్తున్న సీఐ చంద్రమౌళి

గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనుగౌడ్



గార్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘం గార్ల పట్టణ అధ్యక్షుడిగా శ్రీనుగౌడ్‌ను సంఘం సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు తోడేటి శ్రీనుగౌడ్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. మరో పది మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈమేరకు గతంలో పనిచేసిన అధ్యక్షుడి నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. తాళ్లపల్లి కృష్ణాగౌడ్, మండా రవిగౌడ్, గన్నేబోయిన రాజు, కత్తిసత్యం గౌడ్, పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో కాలనుగుణంగా వస్తున్న వ్యాధుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని అయోధ్యపురం వైద్యాధికారి డాక్టర్ యమున, గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం గైనకాలజిస్ట్ డాక్టర్ నవత అన్నారు. గూడూరు మండలం అప్పరాజుపల్లిలో అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా స్వస్థ్‌నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలకు సంక్రమించే వ్యాధులు, కాలనుగుణంగా వచ్చే జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 12 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డాక్టర్ శిరజ్, ప్రతిభ, హెచ్‌ఈవో లోక్య, సిబ్బంది గణేష్, సర్దార్‌బాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలి : సీపీఐ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తి వేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచి పోరాడిన కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు గురువారం సీపీఐ నేతలు అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, మామిండ్ల సాంబలక్ష్మితో పాటు మరికొంత మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాటి ఉఉద్యమకారులపై కక్షకట్టి, అక్రమ కేసులు బనాయించారని దీంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి అక్రమ కేసులను ఎత్తివేయాలని ఈయన విజ్ఞప్తి చేశారు.

దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం


రామమందిరంలో సమావేశమైన గ్రామస్థులు

కేసముద్రం, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో ఈ సారి బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ముత్యాలమ్మ, బోనాల పండుగ కమిటీ బాధ్యులు అల్లం నాగేశ్వర్‌రావు, జాటోత్ హరీష్‌నాయక్ వెల్లడించారు. స్థానిక రామమందిరంలో గురువారం గ్రామస్థులు సమావేశమయ్యారు. అన్నివర్గాలను కలుపుకొని మునిసిపాలిటీ కమిషనర్ సహకారంతో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముత్యాల శివకుమార్, బచ్చు పరమేశ్వర్, ముల్క మురళి, పోలెపాక నాగరాజు, తరాల వీరేష్, శీలం సత్యనారాయణ, సంగె రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


లక్కు(ఫైల్)

కేసముద్రం, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ఆర్‌వోబీ వద్ద కిలోమీటరు 421/6-8 డౌన్‌లైనులో గురువారం ఉదయం స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన భూక్య లక్కు (56) రైల్వేట్రాక్ దాటుతుండగా గూడ్స్‌రైలు ఢీకొని మృతి చెందినట్లు వరంగల్ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ గంగధారి సుదర్శన్ తెలిపారు. లక్కు కొద్దినెలల క్రితం ప్రమాదంలో కాలు విరగడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ట్రాక్ అవతలివైపున ఉన్న తన ఇంటికి వెళుతున్న క్రమంలో గూడ్స్‌రైలు ఢీకొనడంతో తలచిద్రమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య విజయ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని పెద్ద కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.


సెయింట్ జాన్స్ స్కూల్లో ఎస్‌జీఎఫ్ఐ క్రీడలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎంలు

ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడలు

కేసముద్రం, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని ధన్నసరి సెయింట్ జాన్స్ హైస్కూల్లో గురువారం ఎస్‌జీఎఫ్ఐ 69వ అండర్ 14, 17 బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మండల స్థాయి క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడలను కల్వల, కేసముద్రం విలేజి హెచ్‌ఎంలు బండారు నరేందర్, జి.రాజశేఖర్, పాఠశాల హెచ్‌ఎం శ్రవణ్ రెడ్డిలు ప్రారంభించారు. 400 విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొనగా పలువురు జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పీడీలు కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, డి.విజయ్‌చందర్, పద్మ, రవి, సమ్మెట లలిత, స్రవంతి, నామాల మహేష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో అధికారుల విచారణ

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం బ్రహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలకు సంబంధించిన ఐదు క్వింటాళ్ల బియ్యం ఓ ప్రైవేట్ వ్యక్తి ఇంట్లో లభ్యం కావడం పట్ల గురువారం అధికారులు విచారణ చేపట్టారు. కేజీబీవీకి మహబూబాబాద్ జీసీడీవో విజయకుమారి, సివిల్‌సప్లయీస్ డీటీ సత్యనారాయణ, ఎంఈవో రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణలు విచారణ గురుకులంకు చేరుకుని విచారణ చేపట్టారు. పాఠశాల ఎస్‌వో సునీత, బియ్యం తీసుకువెళ్లిన కిరాయి ట్రాక్టర్ యాజమాని వీరన్న, వర్కర్లు, సిబ్బందిని విచారించారు. వారి వాగ్మూలాలను సేకరించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.


బ్రహ్మణపల్లి కేజీబీవీలో విచారణ చేపడుతున్న అధికారులు

స్త్రీలకు ప్రత్యేక వైద్య శిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ ప్రత్యూష

గంగారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ క్రింద గురువారం గంగారం పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వందమందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం క్రింద మహిళలు, కౌమారదశలో ఉన్న బాలికలు పిల్లల ఆరోగ్యానికి సంరక్షణ సేవలందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వరావు, లక్ష్మీ, వనజ, రాణి, మోహన్, రమాదేవి, నిర్మల పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కేసముద్రం, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకతీయుల నాటి పురాతన శివాలయంలో బీజేపీ సేవాపక్షంలో భాగంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో గొట్టె వెంకన్న, కాలెపాక వంశి, జల్లె విజేందర్, అయినాల వెంకన్న, పుల్ల వెంకన్న, జల్లె ప్రశాంత్, బానోత్ రాము, బానోత్ నరేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పాలకుర్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల లో చదువుతున్న క్రీడాకారులకు ప్రధానోపాధ్యాయుడు పుస్కూరి రమేష్ గురువారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులురాలు పల్లకొండ ఉమారాణి తన సొంత ఖర్చు వెచ్చించి 20మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శోభ, శ్రీహరి, శ్రీష్మ, రాణి, మేరీ, ప్రతిభ, వకుళ, వెంకటేష్, అశోక్, వరలక్ష్మీ, స్వప్న ఉన్నారు.


తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్

'తాగునీటి ఎద్దడిని నివారిస్తాం'

గార్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రజలకు రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకొని, అన్ని వార్డుల్లో సమస్యను నివారిస్తామని పంచాయతీ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని గండి, జీవంచిపల్లి గ్రామాలకు నూతనంగా తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అన్ని వార్డుల్లో ప్రతీ ఇంటికి తాగునీరు అందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని, నిధులు మంజూరు కాగానే పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిషోర్, శ్రీను, దాసు, రమేష్ పాలల్గొన్నారు.

సింగరేణిలో కలకలం

(5వ పేజీ తరువాయి)

ఏర్పడింది. దీంతో సుమారు అరగంట పాటు అధికారులు రక్షణ చర్యలు చేపట్టి అతడిని బయటకు తీసుకరాగా అస్వస్థతో ఉన్న ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. కాగా, నలుగురు కార్మికులకు ప్రాణాపాయం తప్పింది.

గనిలో చోటు చేసుకున్న ప్రమాదంపై సింగరేణి, ఫైర్, రెస్క్యూ, సెక్యూరిటీ, సెఫ్టీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం కవీంద్ర ఘటనా స్థలికి చేరకొని ఘటనపై ఆరా తీశారు. అలాగే, సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ పాటు సింగరేణి రెస్క్యూ, సెఫ్టీ, ఫైర్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని గనిలో చెలరేగుతున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రెండు గంటల తరువాత కూడా మంటలు ఆరిపోకపోవడంతో రెండో షిఫ్టులో కార్మికులను లోనికి అనుమతించలేదు. రాత్రి 8 గంటల వరకు కూడా గనిలో మంటలు వ్యాప్తి తగ్గలేదని, ఇంకా సుమారు 5 గంటలు ఆర్పే ప్రయత్నం చేస్తే గానీ ఆగే పరిస్థితి లేదని ఫైర్ అధికారులు చెప్పారు. ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అటు అధికారులు, ఇటు కార్మికుల కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి.

కళాకారులకు డప్పులు పంపిణీ


ఈరవెన్నులో కళాకారులకు డప్పులను పంపిణీ చేస్తున్న భాస్కర్

పాలకుర్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తొర్రూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కూస భాస్కర్ ఈరవెన్ను గ్రామానికి చెందిన డప్పు కళాకారులకు గురువారం డప్పులను అందచేశారు. భాస్కర్ మాట్లాడుతూ తన తండ్రి కూస కొంరయ్య స్మారకార్థం గ్రామానికి చెందిన కళాకారులకు రూ.50వేలు విలువైన 60 డప్పులను అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బి ద్రు సోమేశ్వర్, మాజీ మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, సత్తిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మహేందర్ రెడ్డి, బీజేపీ గ్రామ అధ్యక్షుడు ముస్కు ఉప్పలయ్య, మాజీ ఎంపీటీసీ కొడిశాల యాదగిరి తదితరులు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జడ్పీ, లోకల్ బాడీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు అక్టోబరు 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి గురువారం ఒక ప్రకనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో 7వ తరగతిలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ http//bse. tel angana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజు రూ.100 ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.50 ఫీజు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 98497 61012ను సంప్రదించాలన్నారు.

కడియం రాజీనామా చేయాలంటూ లేఖలు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై, కా ర్యకర్తల శ్రమతో గెలిచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరుతూ గురువారం కడియంకు పోస్టుకార్డులు పంపించారు. మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద పోస్టుబాక్స్‌లో ఉత్తరాలు వేసి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ మునిసిపాలిటీ పట్టణాధ్యక్షు డు కనకం గణేష్ మాట్లాడుతూ రాజీనామా చేయాలని అనేక విధాలా చెప్పి నా కడియం స్పందించడం లేదని, పోస్టుకార్డులను తన ఇంటి అడ్రసుకు పంపించడంతోనైనా స్పందిస్తాడనే నమ్మకంతో ఉత్తరాలు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఒగ్గు రాజు, తాటికొండ సురేష్, మారపల్లి ప్రసాద్, పెసరు సారయ్య, బంగ్లా శ్రీనివాస్, అకారపు అశోక్, పార్శి రంగన్న, గుండె మల్లేషం పాల్గొన్నారు.